క్లుప్తంగా

జగనన్న పర్యటన విజయవంతం చేయండి


రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే, పాతపట్నం

ఎల్.ఎన్.పేట: ఈ నెల 20వ తేదీన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలకొండ పర్యటనను విజయవంతం చేయాలని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, తన తండ్రి పాలవలస రాజశేఖరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారన్నారు. తమ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు జగన్‌మోహన్ రెడ్డి మధ్యాహ్నం 2 గంటలకు పాలకొండకు వస్తున్నారన్నారు. పాతపట్నం నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాలకొండకు వచ్చి జగనన్నకు సాదర స్వాగతం పలకాలని కోరారు.

న్యాయ సేవలపై అవగాహన


ఖైదీలతో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

పాతపట్నం: ఖైదీలు న్యాయ సేవలను వినియోగించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి (డీఎల్ఎస్ఏ) ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం పాతపట్నం సబ్ జైల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఖైదీల బ్యారక్‌లు, వంట గదులు, సరుకుల నాణ్యత, ఖైదీల హాజరు రికార్డులను పరిశీలించారు. అనంతరం డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న బాలుర కళాశాల వసతి గృహాన్ని, బాలాజీనగర్–3లో ఉన్న బాలికల ప్రీ మెట్రిక్ హాస్టల్ పరిశీలించారు. సబ్‌జైలర్ ఎం.రాము, హాస్టల్ వార్డెన్‌లు గురువులు, శ్రీలక్ష్మి, న్యాయవాదులు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

థంబ్ వేయించారు.. రేషన్ పంపిణీ మరిచారు..


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జయమునిరావు

మెళియాపుట్టి: మండలంలోని దీనబంధుపురం పంచాయతీ కుద్దబ గ్రామంలో సుమారు 15 కుటుంబాలకు ఈ నెల 7వ తేదీన నిత్యావసర సరుకుల పంపిణీ వాహనం వద్ద వేలిముద్రలు వేయించారని, నేటివరకు సరుకుల పంపిణీ చేయలేదని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పోలాకి జయమునిరావు అన్నారు. తహసీల్దార్ పాపారావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. కార్డుదారులు ప్రశ్నిస్తే స్టాక్ లేదని చెబుతున్నారని, రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని జయమునిరావు కోరారు. పార్టీ కార్యకర్త సంజీవరావు, తదితరులు ఉన్నారు.

6 కిలోలు ఇస్తేనే అన్‌లోడ్!


రైస్ మిల్లు వద్ద అన్‌లోడ్ చేయకుండా ఉన్న ధాన్యం బస్తాలు

సరుబుజ్జిలి: బస్తాకు 6 కిలోలు ధాన్యం ఇస్తేనే ట్రాక్టర్ నుంచి అన్‌లోడ్ చేస్తాం, లేదంటే అన్‌లోడ్ చేసేది లేదని తేల్చి చెప్పిన రైస్ మిల్లు నిర్వాహకులు. ఆమదాలవలస మండలం బొబ్బిలిపేట గ్రామానికి చెందిన చింతాడ అప్పారావుతోపాటు మరికొంతమంది రైతులు మండలంలోని చిన్నపాలెం గ్రామానికి సమీపంలో గల రైస్ మిల్లుకు మంగళవారం ట్రాక్టర్ల ద్వారా ధాన్యం లోడ్‌లు తీసుకెళ్లారు. ప్రతీ బస్తాకు తేమ శాతం పేరుతో 6 కిలోల వరకు ధాన్యం ఇవ్వకపోతే బస్తాలు దించేదిలేదని మిల్లు నిర్వాహకులు తిప్పి పంపిచేస్తున్నట్లు రైతులు తెలిపారు. ట్రక్ షీట్ పట్టుకొని మిల్లు వద్దకు వెళ్లినా మిల్లు యాజమాన్యం పట్టించుకోలేదని ఆరోపించారు. ఇదే విషయమై సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా.. తరుగు పేరుతో రైతులు వద్ద ధాన్యం డిమాండ్ చేయకూడదన్నారు. వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకొంటామని వెల్లడించారు.

రక్తదానం.. ప్రాణదానం


రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట: ఆపదలో ఉన్నవారిని కాపాడేందుకు యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. మండలం చోడవరంలో అడపా మోహన్‌రావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్, రణస్థలానికి చెందిన ఇస్కాన్ బృందం నేతృత్వంలో రక్తదాన శిబిరం, 60 ఏళ్లు నిండిన 70 మంది పుణ్య దంపతులకు పాదపూజ, గ్రామంలో ఉన్న లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం మంగళవారం నిర్వహించారు. రక్తదానం చేసిన 18 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ట్రస్టు ప్రతినిధులు చంద్రశేఖర్, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు భాస్కర బట్ల జగదీశ్వరరావు, కరుణ, సంతోషి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మేట్‌లకు పెద్దపీట


అంతరాబ చేరువులో పనిచేస్తున్న ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీడీ సురేష్

- ప్రతీ 50 మంది వేతనదారులకు ఒక మేట్
- రూ.1.50 చొప్పున అదనంగా చెల్లింపు
- ఫీల్డ్ అసిస్టెంట్ లేనిచోట మేట్‌లకు అదనపు బాధ్యతలు

పాతపట్నం మండలంలో వేతనదారులు	5,931
జాబ్ కార్డులు	10,711
ఏర్పాటు కానున్న శ్రమశక్తి సంఘాలు	216
అవసరమైన మేట్‌లు	216
కొత్తూరు మండలంలో వేతనదారులు	17,822
జాబ్ కార్డులు	14,567
ఏర్పాటు కానున్న శ్రమశక్తి సంఘాలు	153
అవసరమైన మేట్‌లు	153
మెళియాపుట్టి మండలంలో వేతనదారులు	16,975
జాబ్ కార్డులు	10,411
ఏర్పాటు కానున్న శ్రమశక్తి సంఘాలు	228
అవసరమైన మేట్‌లు	228
హిరమండలం మండలంలో వేతనదారులు	11,902
జాబ్ కార్డులు	7,305
ఏర్పాటు కానున్న శ్రమశక్తి సంఘాలు	153
అవసరమైన మేట్‌లు	153
ఎల్.ఎన్.పేట మండలంలో వేతనదారులు	11,528
జాబ్ కార్డులు	7,177
ఏర్పాటు కానున్న శ్రమశక్తి సంఘాలు	126
అవసరమైన మేట్‌లు	126

పాతపట్నం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మేట్‌లు కీలకంగా మారనున్నారు. ఇప్పటికే ఫీల్డ్ అసిస్టెంట్లు లేనిచోట మేట్‌లకు బాధ్యతలు అప్పగించారు. అలా కాకుండా ప్రతీ శ్రమశక్తి సంఘానికి ఒక మేట్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేట్‌ల పరిధిలో కనీసం 50 మంది వేతనదారులు ఉంటారు. ఇప్పుడు మాత్రం 50 మంది యాక్టివ్ వేతనదారులంతా ఒక శ్రమశక్తి సంఘంగా ఏర్పడితే ఈ సంఘానికి మేట్ బాధ్యత వహిస్తాడు. ఇలా ఉన్న మేట్‌కు ఆ రోజు పనికి వచ్చిన వేతనదారుల ఆధారంగా ఒక్కో వేతనదారు నుంచి రూ.1.50 చొప్పున అదనపు వేతనాన్ని మేట్‌కు చెల్లిస్తారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని సమయంలో సీనియర్ మేట్లు, పని నిబద్ధత కలిగిన మేట్‌లకు పనుల బాధ్యతలు అప్పగిస్తారు.

బలోపేతం దిశగా శ్రమశక్తి సంఘాలు..

గతంలో శ్రమశక్తి సంఘాలు నామమాత్రంగానే పనిచేసేవి. ఇప్పుడు 30 నుంచి 50 మంది వేతనదారులను శ్రమశక్తి సంఘంగా ఏర్పర్చుతున్నారు. ఈ సంఘాల ద్వారా వేతనదారులకు సకాలంలో పని కల్పించేలా, కనీస వేతనం వచ్చేలా చర్యలు తీసుకుంటా న్నారు. ఈ సంఘాలకు చెందిన వేతనదారుడే మేట్‌గా వ్యవహరిస్తారు. ప్రతిరోజూ ప్రతీ వేతనదారునికి కనీసం రూ.300 వేతనం గిట్టుబాటు అయ్యేలా కేంద్రం చర్యలు తీసుకుంటోంది. 100 రోజుల గ్యారంటీ పనిని పూర్తి చేయిస్తే ఆయా వేతనదారుని ద్వారా రూ.3లు అదనంగా ఆ సంఘ మేట్‌కు అందనుంది. ఇలా శ్రమశక్తి సంఘాలను బలోపేతం చేస్తున్నారు.

మేట్‌లకు అదనపు వేతనం..



ఇప్పుడు అన్ని గ్రామాల్లో శ్రమశక్తి సంఘాలకు మేట్‌ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఆ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశారు. ఎన్నికల కోడ్ అనంతరం ప్రతీ గ్రామంలో శ్రమశక్తి సంఘాలు, మేట్‌ల ఎంపిక తప్పనిసరిగా జరుగుతుంది. మేట్‌లకు బాధ్యతలు అప్పగించడం ద్వారా అదనపు వేతనం కూడా లభిస్తుంది.
– టి.చంద్రకుమారి, ఎంపీడీఓ, పాతపట్నం

ఘనంగా పవిడి తల్లి సంబరాలు

కొత్తూరు: మండల కేంద్రంలో పవిడి తల్లి అమ్మవారి సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఘటాలతో గ్రామంలో తిరవీధి నిర్వహించి అమ్మవారికి చల్లదనం చేశారు. మూడేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ సంబరాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పవిడి తల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

విజయగౌరీకి మద్దతివ్వండి

మెళియాపుట్టి: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దొరకాలంటే ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న కె.విజయగౌరీని గెలిపించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ అభ్యర్థితో కలిసి మండలంలోని పెద్దలక్ష్మీపురం, మెళియాపుట్టి, బందపల్లి, కొసమాల, పెద్ద పద్మాపురం ఉన్నత పాఠశాలలు, గిరిజన వెల్ఫేర్ కళాశాలలో ఉపాధ్యాయులను కలిశారు. యూటీఎఫ్ అకడమిక్ సెల్ కన్వీనర్ ఎల్వీ చలం, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ జిల్లా కౌన్సిలర్ రవి పాల్గొన్నారు.



మెళియాపుట్టి: బందపల్లి ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులతో విజయగౌరి

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విజయగౌరీకి మద్దతుగా నిలవాలని యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు సంపతిరావు కిశోర్, టి.వి.టి.భాస్కరరావు కోరారు. పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రచారం చేపట్టారు. యూటీఎఫ్ మండల, పట్టణ శాఖలకు చెందిన ఉపాధ్యాయులు తమ్మినేని పాపారావు, పైల అప్పలనాయుడు, చింతాడ వెంకటసత్యనారాయణ, బెజ్జిపురపు సూర్యనారాయణ, మెండ శ్యామలరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఇంటర్మీడియెట్ కీలకం

హిరమండలం: ప్రతీ విద్యార్థి ఇంటర్మీడియెట్ దశ కీలమని రామా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.యుగంధర్ అన్నారు. మంగళవారం కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోల వేడుకను ఘనంగా నిర్వహించారు. సినీ గీతాలకు విద్యార్థులు డాన్సులు వేశారు. కళాశాల కరస్పాండెంట్ రెడ్డి గోపాలరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పొందూరు రూరల్: మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను డ్వామా పీడీ బి.సుధాకర్‌రావు పరిశీలించారు. నందివాడ, నరసాపురం గ్రామాల్లో జరిగిన ట్రెంచ్, ఆయిల్ పామ్, కాలువ పనులను పరిశీలించారు. ఎంపీడీఓ మన్మధరావు, ఏపీఓ శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రూ.300 పొందేలా పనులు చేయాలి

కొత్తూరు: ఉపాధి హామీలో పనులు చేసే వేతనదారులు కనీసం రూ.300 నిర్దిష్ట వేతనం లభించేలా పని చేయాలని డ్వామా పీడీ సుధాకరరావు అన్నారు. నేరడి, మాసింగిగూడ గ్రామాల్లో ఆర్వోఎఫ్ఆర్ పనులను, సీఎల్ఆర్సీ భవనాన్ని మంగళవారం పరిశీలించారు. ఏపీడీ రాధ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

పాతపట్నం: స్థానిక ఆల్ ఆంధ్రా రోడ్డులో గల ఇందిరమ్మ కాలనీలో నీరంజన్ గురుస్వామి ఆధ్వర్యంలో నీలమణిదుర్గ ఆలయం 15వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

నరసన్నపేట: స్వయం శక్తి సంఘాల్లో ఉన్న సభ్యులకు వారి అవసరాలకు వీలుగా లోన్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, ఆ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని జమ్ము గ్రామంలో మంగళవారం స్వయం శక్తి సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఏరియా కోఆర్డినేటర్ కొండలరావు, ఏపీఎం అప్పలరామయ్య, వీఓఏ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగులో ప్రకృతి వ్యవసాయం

ఎల్.ఎన్.పేట: సేంద్రియ సాగు పద్ధతుల్లో ప్రకృతి వ్యవసాయం చేయటం జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం మండల యూనిట్ ఇన్‌చార్జి లలిత అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ప్రకృతి వ్యవసాయ పంట దిగుబడుల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

ఆమదాలవలస రూరల్: మండలంలోని శ్రీనివాసాచార్యులపేటలో మంగళవారం భ్రమరాంబ సహిత సుందర మల్లికార్జున స్వామి ఆలయంలో శివపార్వతీల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతిరావు, ఆలయ అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రహదారులను బాగు చేయండి

హిరమండలం: మండలంలో రహదారులు దారుణంగా ఉన్నాయని వాటిని మరమ్మతులు చేయాలని ఆర్ అండ్ బీ జేఈ సాగర్‌కు బీజేపీ మండల నాయకులు మంగళవారం వినతిపత్రం అందించారు. అలికాం–బత్తిలి రహదారిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద రహదారి పూర్తిగా పాడైందని, మండలంలోని పలు గ్రామాల్లోని రహదారులు గుంతలమయంగా ఉన్నామన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఆర్.ఢిల్లేశ్వరావు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధిలో ఎస్‌హెచ్‌జీల పాత్ర కీలకం

హిరమండలం: గ్రామాల అభివృద్ధిలో ఎస్‌హెచ్‌జీల పాత్ర కీలకమని డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో హిరమండలం, కొత్తూరు, మెళియాపుట్టి మండల వెలుగు సీసీలు, మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. ఏపీడీ ఎం.సన్యాసిరావు, మెళియపుట్టి, హిరమండలం, కొత్తూరు ఏపీఎంలు పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 44 మంది విద్యార్థులకు కళ్లద్దాలను పంపిణీ చేసినట్లు హెచ్ఎం ఎస్.వైకుంఠరావు అన్నారు. పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అప్తాలమిక్ అనూసూయ విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంద రోజులు లక్ష్యంగా పనులు చేపట్టాలి

ఎల్.ఎన్.పేట: జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి వంద రోజులు పని కల్పించటమే లక్ష్యంగా తీసుకోవాలని డ్వామా పీడీ బి.సుధాకర్ సూచించారు. మండలంలోని కరకవలస పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. గ్రామాల్లో రైతులకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలన్నారు. క్లస్టర్ ఏపీడీ పి.రాధ, ఉపాధి ఏపీఓ వి.శ్రీదేవి, సాంకేతిక, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం చూపిస్తే చర్యలు

ఆమదాలవలస: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, వివిధ శాఖల సిబ్బంది విధుల్లో అలసత్వం చూపిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో మంగళవారం తెల్లవారుజామున పర్యటించి తాగునీటి నాణ్యతను, శానిటేషన్ పనులను పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు.

జూదరుల అరెస్టు

కొత్తూరు: మండలంలోని బమ్మిడి గ్రామంలో జూదం ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్ఐ ఎండీ అమీర్ అలీ మంగళవారం తెలిపారు. వారి నుంచి రూ.1,484 నగదు, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు.

జేసీబీ, ట్రాక్టర్ సీజ్


తహసీల్దార్ కార్యాలయానికి తరలించిన జేసీబీ, ట్రాక్టర్

పాతపట్నం: మండలంలోని రంకిణి పంచాయతీ భగంతర గ్రామ సమీపంలోని కొండను అక్రమంగా (కంకర, మట్టి) తవ్వుతుండగా జేసీబీ, టాక్టర్‌ను రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. అనుమతి లేకుండా అక్రమంగా కంకర, మట్టిని రియల్ ఎస్టేట్‌లకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బంది వెళ్లి వాహనాలను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చారు. ఇటీవల ఆదివారం, సెలవు రోజుల్లో ట్రాక్టర్ ద్వారా కంకర అక్రమంగా తరలించారు. ఇదే విషయం తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. అక్రమంగా కొండను తవ్వి కంకర, మట్టి తరలిస్తుండా వాహనాలను పట్టుకున్నామన్నారు. వీటిని టెక్కలి మైన్స్ అధికారులు అప్పగించామని తెలిపారు.

ఉత్తమ ఎన్నికల అధికారిగా వేదిత


అవార్డు అందుకుంటున్న వేదిత

ఎల్.ఎన్.పేట: పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కుమార్తె, ఢిల్లీ నార్త్ ఈస్ట్ కలెక్టర్ రెడ్డి వేదిత (ఐఏఎస్) ఉత్తమ ఎన్నికల అధికారి అవార్డును అందుకున్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో అవార్డును అందజేశారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది (2024)లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఈ అవార్డు దక్కిందన్నారు. గతంలో కూడా బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించి ఉత్తమ కలెక్టర్ అవార్డును వేదిత అందుకున్నారు. వేదితతోపాటు పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి పలువురు అభినందనలు తెలిపారు.

పరామర్శ..


పాపారావును పరామర్శిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు రూరల్: మండలంలోని పిల్లలవలస గ్రామ సర్పంచ్ మొదలవలస పాపారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయన ఇంటికి మంగళవారం మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం వెళ్లి పరామర్శించారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వెంకటసత్యనారాయణ, కళింగ కుల రాష్ట్ర చైర్మన్ దుంపల లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ సునీల్‌కుమార్, తదితరులు ఉన్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేయాలి



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని సుబ్బపేట వద్ద రహదారికి ఇరువైపులా గుబురుగా ఉన్న పొదలు. సవళాపురం జంక్షన్ నుంచి యరగాం వరకు గల ఆర్ అండ్‌బీ రహదారిలో జంగిల్ క్లియరెన్స్ చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. రహదారికి ఇరువైపులా గుబురుగా తుప్పలు పేరుకుపోవడం వలన ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడంలేదు. దీనివలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేయించాలని స్థానికులు, ప్రాయాణికులు కోరుతున్నారు. – సరుబుజ్జిలి

డీలర్ల సంఘం ఎన్నిక ఏకగ్రీవం



నరసన్నపేట మండల డీలర్ల సంఘ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా లావేటి మురళీమోహనరావు, కార్యదర్శిగా రావాడ సుహాశిని, గౌరవ అధ్యక్షుడిగా వి.వి.భాస్కరరావు, కోశాధికారిగా గంటాన సుమలతను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు వి.భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి రవికుమార్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. – నరసన్నపేట

ప్రమాదకర మలుపు



కొత్తూరు మండలం మాతల–రుగడ రోడ్డులో మాకవరం వద్ద మలుపు ఉంది. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. ఈ మలుపు వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మలుపు వద్ద హెచ్చరిక బోర్డుతోపాటు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. – కొత్తూరు

బిజీ..బిజీ..



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలంలోని మురగడలోవ గ్రామంలో పసుపు ఉడక పెట్టే పనుల్లో బిజీగా ఉన్న గిరిజన రైతులు. పచ్చ బంగారంగా చెప్పుకునే పసుపు పంట కోతకు చేరుకోవటంతో పంట దిగుబడులు దక్కించుకునే పనుల్లో కొన్ని రోజులుగా గిరిజనులు బిజీగా ఉన్నారు. పసుపు తవ్వకం, శుద్ధి చేయటం, ఉడికించటం, ఎండ బెట్టడం వంటి పనులు చేస్తున్నారు. – ఎల్.ఎన్.పేట

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

- ఎంపీపీ కర్నేన దీప

బూర్జ: అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని ఎంపీపీ కర్నేన దీప అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ శాశ్వత గుర్తింపు సంఖ్య కోసం రైతులు సచివాలయ వ్యవసాయ సహాయకుల వద్దకు వచ్చి మార్చి ఆఖరులోగా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఎంఈఓ ఎస్.శ్యామసుందరరావు మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి జరగనున్నందున శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ కర్నేన దీప

హౌసింగ్ ఏఈ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కాలనీ ఇళ్లు కావాల్సిన లబ్ధిదారులు త్వరగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, తహసీల్దార్ వై.వి.పద్మావతి, గుత్తావల్లి, బూర్జ పీహెచ్‌సీ వైద్యులు జి.రాజశేఖర్, పి.రోజా, ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్.గీతా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భూ సమస్యలు త్వరగా పరిష్కరించండి

పొందూరు: శ్రీకాకుళం డివిజన్ పరిధిలో 8 వేలకు పైగా రీసర్వే ఫిర్యాదులు వచ్చాయని ఆర్డీఓ సాయి ప్రత్యూష తెలిపారు. మండలంలోని దళ్లవలసలో రీసర్వే ఫిర్యాదులపై వీఆర్వోలు, సర్వేయర్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. డివిజన్‌లో పొందూరు, ఆమదాలవలస, ఎచ్చెర్ల మండలాల నుంచే అధికంగా ఫిర్యాలు వచ్చాయన్నారు. భూ సమస్యలను త్వరగా పరిష్కరించేలా చూడాలని తహసీల్దార్ వెంకటేష్ రామానుజులకు సూచించారు. నోటీసులకు స్పందించిన రైతుల సమస్యలను ఐదు రోజుల్లోగా పరిష్కరించాలన్నారు. పొందూరు మండలానికి సంబంధించి వచ్చిన ఫిర్యాదులు పరిష్కరించేందుకు రాత్రులు, సెలవు రోజుల్లో సిబ్బందితో పనిచేస్తున్నామని తహసీల్దార్ చెప్పారు. దళ్లవలసలో ఎక్కువ ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సచివాలయ కార్యదర్శి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ సాయిప్రత్యూష

అన్నదాతల ఆందోళన

సరుబుజ్జిలి: వంశధార అధికారుల నిర్లక్ష్యధోరణి వలన 600 ఎకరాల్లో రబీ వరి పంటలకు సాగునీరు అందక ఎండిపోయే దశకు చేరుకున్నారని రైతులు మంగళవారం తమ పొలాల వద్ద నిరసన తెలిపారు. పిల్ల కాలువ నుంచి సైలాడ చెరువు ఆయకట్టు పరిధిలోని కొండవలస, సైలాడ, కుమ్మరిపేట, దివంజిపేట, జొన్నవలస, పురుషోత్తపురం, చిన్నపాలెం గ్రామాలకు సంబంధించిన పంటలకు సాగునీరు అందించడం లేదన్నారు. తమ పంట పొలాలకు కాకుండా వేరొక ప్రాంతానికి సాగునీటిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. చేతికందివచ్చిన పంట ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి రబీ పంటకు సాగునీటిని విడుదల చేయాలని, లేకపోతే సాగునీటి కార్యాలయాల ఎదుట నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు.


కొండవలసలో పంట పొలాల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు